# ఆగమాగం ఓటేస్తే రైతు బతుకు ఆగమే!

## కాంగ్రెస్ హయాంలో లోఓల్టేజీలతోనే సరిపోయింది

గతంలో ఒక ట్రాన్స్‌ఫార్మర్‌కి 60 మోటర్లు ఉండేవి. ప్రస్తుతం 10 మోటర్లకు ఒక ట్రాన్స్‌ఫార్మర్ ఉండడంతో నాణ్యమైన విద్యుత్ సప్లై అవుతుంది. అందుకే ప్రస్తుతం మోటర్లు కరాబ్ అవుతలేవు . మెకానికులకు గిరాకీ తగ్గింది. నాకు మోటర్లు వెలికి తీసే ట్రాక్టర్ ఉన్నది. ప్రస్తుతం కొత్త బోర్లు వేసిన వారికి మోటర్లు ఫిట్ చేయడం తప్ప పాత బోర్లు రిపేర్‌కు అంతగా వస్తలేవు. అప్పట్లో లో ఓల్టేజీ సమస్య చాలా ఉండేది. ప్రస్తుతం సబ్‌స్టేషన్లు, ట్రాన్స్‌ఫార్మర్లు పెరగడంతో ఎలాంటి సమస్య లేదు. కాంగ్రెస్ నాయకులు చెబుతున్నట్లు 3గంటల కరెంట్ ఇస్తే అరకొర కరెంట్‌తో ప్రజలు ఇబ్బంది పడుతరు. 24 గంటల కరెంట్ సరఫరాతో రైతు ఇష్టమున్నప్పుడు మోటర్ పెట్టుకుంటుండు. అప్పుడు తనకు అవసరమైన విద్యుత్ వాడుకుంటుండు. ప్రస్తుతం రైతులు సంతోషంగా ఉంటున్నరు.

– చాంద్‌పాష, మోటార్ మెకానిక్, చండూరు





# కాంగ్రెస్ వస్తే కరెంట్ ఖతమే

## 10హెచ్‌పీ మోటర్లు పెట్టుకుంటే రైతు మునుగుడే



నేను 30యేండ్లుగా వ్యవసాయం చేస్తున్నా. పదేండ్ల క్రితం వ్యవసాయానికి సరిపడ కరెంట్ లేదు. లో ఓల్టేజీ కరెంట్‌తో మోటర్లు కాలిపోయి పంటలు ఎండిపోయాయి. పెట్టిన పెట్టుబడులు రాక అప్పుల పాలై నానా ఇబ్బందులు పడ్డాం. తెలంగాణ వచ్చాక సీఎం కేసీఆర్ పుణ్యమా అని నిరంతరం కరెంట్ వస్తుంది. సాగునీటి కష్టాలు తప్పి ఇప్పుడిప్పుడే మా జీవితాల్లో వెలుగు నిండుతున్నాయి. ప్రస్తుతం కాంగ్రెస్ నాయకుడు రేవంత్‌రెడ్డి 10హెచ్‌పీ మోటారు పెట్టుకుంటే వ్యవసాయానికి 3గంటల కరంట్ చాలంటుండు. రేవంత్‌రెడ్డిని నమ్ముకుంటే రైతులు మూడు చర్ల నీళ్లు తాగాలి. 5హెచ్‌పీ మోటార్ పెడితే ఎకరం పొలం పారేందుకు 5గంటలు పడుతుంది. నీరు కూడా భూమిలోకి ఇంకడం వల్ల పంటలు బతుకుతాయి. అదే 10హెచ్‌పీ మోటర్ పెడితే బావులు, బోర్లలో నీరు తొందరగా అయిపోయి పంటలు ఎండిపోతాయి. 10 హెచ్‌పీ మోటర్లు వాడితే 200కేవీ ట్రాన్స్‌ఫార్మర్లు అవసరం ఉంటుంది. సుమారు 8యూనిట్ల కరెంట్ కాలుతుంది. 3గంటల కరెంట్, 10హెచ్‌పీ మోటర్‌తో రైతులు వ్యవసాయం చేసుకోలేక మూట ముల్లె సర్దుకుని దేశాలు పట్టుకొని పోవాలి. రైతుల కష్టాలు తెలిసిన సీఎం కేసీఆర్ సార్‌కే మా మద్దతు.

– పోలేపల్లి నారాయణరెడ్డి, రాయినిపాలెం, మిర్యాలగూడ రూరల్

## హస్తం పార్టీ హయాంలో అంతా కరెంట్ కోతలే..

**నాడు విద్యుత్ లేక అన్నదాత అవస్థలు**

**ఇప్పుడు మళ్లీ 3 గంటల కరెంట్ చాలంటూ బూటకం**

**కాంగ్రెస్‌కు పుట్టగతులుండవని రైతుల ఆగ్రహం**

**దేశంలో ఎక్కడా లేని విధంగా వ్యవసాయానికి బీఆర్‌ఎస్ సర్కారు అందిస్తున్న 24 గంటల సరఫరాను చూసి కాంగ్రెస్ ఓర్వలేకపోతున్నది. రైతులు సుభిక్షంగా ఉండటాన్ని తట్టుకోలేకపోతున్నది. అందుకే రైతులకు 3 గంటల కరెంట్ చాలని ఆ పార్టీ నేతలు అడ్డగోలుగా వాగుతున్నారు. అంతటితో ఆగకుండా రైతులు 10హెచ్‌పీ మోటర్లు కొనుక్కుంటే సరిపోతుందని ఉచిత సలహాలు ఇస్తున్నారు. దీనిపై రైతులు అగ్గి మీద గుగ్గిలం అవుతున్నారు. సంతోషంగా ఉన్న అన్నదాతను ఆగం చేయడమే లక్ష్యంగా పెట్టుకున్నారని, 3 గంటల కరెంట్‌తో మూల కూడా తడవదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రైతుల నాశనం కోరుకునే కాంగ్రెస్‌కు పుట్టగతులుండవని, ఓట్ల కోసం వస్తే ఉరికించి కొడతామని దుమ్మెత్తిపోస్తున్నారు.**

– యాదాద్రి భువనగిరి, నవంబర్ 24 (నమస్తే తెలంగాణ)

## కాంగ్రెసొస్తే కరెంట్‌కు తిప్పలే

కాంగ్రెసోళ్లు చెప్పే 3గంటల కరెంట్‌తో రైతులకు తిప్పలు తప్పవు. తెలంగాణ వచ్చాక మా లాంటి చిన్నకారు రైతులు 24 గంటల కరెంటుతో వ్యవసాయం చేసి మంచిగ బతుకుతున్నం. తెలంగాణ రాక ముందు ఎప్పుడు కరెంటు వస్తుందో, ఎప్పుడు పోతుందో తెలిసేది కాదు. గతంలో వచ్చిపోయే కరెంట్‌తో ఎన్నో సార్లు కరెంటు మోటర్లు కాలిపోయాయి. సీఎం కేసీఆర్ సార్ 24గంటల కరెంట్, రైతుబంధు, బీమా ఇచ్చి రైతులను ఆదుకున్నడు. 3గంటల కరెంటు ఇచ్చే కాంగ్రెసోళ్లకు ఓటు వేస్తే రైతుల బతుకులు ఆగమవుతయి. 3గంటల కరెంటు వ్యవసాయానికి ఏమాత్రం సరిపోదు. మాకు 24గంటల కరెంటు ఇచ్చే బీఆర్‌ఎస్ ప్రభుత్వమే కావాలి. రైతులమంతా సీఎం కేసీఆర్‌కు అండగా ఉంటాం.

– వరికుప్పల పాపయ్య, కల్మెర(గ్రా), కట్టంగూర్





## రైతుల బతుకు ఆగం చేసే కుట్ర

కాంగ్రెస్ పాలనలో పంటకు నీళ్లు పెట్టేందుకు కరెంటు ఎప్పుడొస్తుందో తెలియక అరిగోసపడ్డం. పంటను కాపాడుకునేందుకు ఎన్ని ఆపసోపాలు పడ్డామో మాకు తెలుసు. ప్రస్తుతం సీఎం కేసీఆర్ ప్రభుత్వం 24గంటల కరెంట్ ఇవ్వడం నయమైంది.. రెండు పంటలకు సరిపడా నీరు అందుతుంది. రైతుల బాధ తెలిసిన వ్యక్తి కాబట్టే సీఎం కేసీఆర్ 24గంటల కరెంట్ ఇస్తుండు. కాంగ్రెసోళ్లు 3గంటల కరెంట్ చాలంటే ఏడంగ పంటలు పండుతయి. రైతుల ఆగం కావాల్నా. 10హెచ్‌పీ మోటర్లు పెట్టుకోమంటున్నరు.. ఏడంగ తెచ్చేది.. కాంగ్రెసోళ్లు మళ్లీ రైతులను ఇబ్బంది పెట్టడం కాకపోతే ఇంకేంటి. రైతులు బీఆర్‌ఎస్‌కే బరాబర్ మద్దతుగా నిలుస్తరు.

– శ్రీనివాస్‌రెడ్డి, గాగిళ్లపురం(గ్రా), చందంపేట( మం)

## పచ్చని పొలాలపై కాంగ్రెసోళ్లు నిప్పులు పోస్తుండ్రు



రాష్ట్రంలో పచ్చగా కళకళలాడుతున్న పంట పొలాలపై కాంగ్రెసోళ్ల కండ్లు పడి నిప్పులు పోసి ఆగం చేసేందుకు కుట్రలు చేస్తున్నరు. టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి రైతులకు 3గంటల కరెంటే చాలు పొలం మొత్తం పారుతదని అంటుండు. ఆయనకు వ్యవసాయం గురించి తెల్వదు కాబట్టే ఇష్టమొచ్చినట్లు వాగుతున్నడు. 3గంటల కరెంట్‌తో కనీసం పది గుంటలైనా తడువదు. అట్లాంటప్పుడు ఐదెకరాలు ఎలా పారుతది. మల్లా 10హెచ్‌పీ మోటార్ వాడాలంటడు. రైతులెవరూ 10హెచ్‌పీ మోటర్లు వాడరు మహా అంటే 3హెచ్‌పీ లేకపోతే 5హెచ్‌పీ వాడుతరు. 10హెచ్‌పీ మోటర్ కొనాలంటే సామాన్లతోటి లక్ష రూపాయలు అయితది మరి రేవంత్‌రెడ్డి కొనిస్తడా. ఇలా ఇష్టమొచ్చినట్లు మాట్లాడుతూ అధికారంలోకొచ్చాక రైతుల గొంతు కొయ్యాలని చూస్తున్నడు. ఎవరు మంచి చేస్తరనేది ప్రజలందరికి తెలుసు. సీఎం కేసీఆర్ సార్ పదేండ్లుగా రైతులకు ఎలాంటి ఇబ్బందులు రానీయకుండా కంటికి రెప్పలా కాపాడుతుండు. ఎప్పటికీ మాకు ఇబ్బందులు లేకుండా చూస్తున్నడు. అట్లాంటిది మేము సీఎం కేసీఆర్ వైపు గాక కాంగ్రెస్ వైపు ఎలా ఉంటాం. కాంగ్రెసోళ్లు మల్లా ఇలాంటి పిచ్చి మాటలు మాట్లాడితే రైతులందరూ ఏకమై బుద్ధి చెప్తాం.

– రంగా, చాంప్లతండా(గ్రా), అడవిదేవులపల్లి

## 3గంటల కరెంట్‌తో పొలం పారదు

కాంగ్రెసోళ్లు చెబుతున్న 3గంటల కరెంట్‌తో పొలం పారదు. గతంలో కరెంట్ ఎప్పుడు పోతుందో, ఎప్పుడు వస్తుందో తెలియకపోయేది. కరెంట్ కోసం పొలం కాడికి పోవాలంటే ఎన్నో కష్టాలు పడ్డాం. ప్రస్తుతం తెలంగాణ సర్కార్ రైతులకు 24గంటల కరెంట్ ఇచ్చాక మా బాధలు తీరినయ్. సీఎం కేసీఆర్ సార్ దయతో ప్రస్తుతం కరెంట్ పోకుండా ఉండడంతో మంచిగా పంటలు పండించుకుని అమ్ముకుంటున్నం. కాంగ్రెస్ రైతులను ఆగం చేయాలని చూస్తున్నది. 3గంటల కరెంటు సరిపోక ఇబ్బందులు పడుతం. కాంగ్రెస్ ఇస్తామంటున్న 3గంటల కరెంటు వద్దు, మాకు సీఎం కేసీఆర్ ఇచ్చే 24కరెంటే మంచిగుంటది. రైతులంతా సీఎం కేసీఆర్ సార్‌కు ఓటేసి అండగా ఉంటాం.

– జంజిరాల ఎల్లయ్య, కల్మెర(గ్రా), కట్టంగూర్



## కాంగ్రెస్‌కు ఓటే సమాధానం

కాంగ్రెసోళ్లు చెబుతున్నట్లు 3గంటల కరెంటిస్తే ఎకరం భూమి సాగు చేయలేం. బీఆర్‌ఎస్ ప్రభుత్వం 24గంటల ఉచిత కరెంట్ ఇస్తుండడంతో రైతుల కష్టాలు తీరాయి. ఇప్పుడిప్పుడే రైతులు మూడు పూటలా తింటున్నారు. రైతులు సంతోషంగా ఉండడం కాంగ్రెస్‌కు ఇష్టం లేనట్లుంది. 10హెచ్‌పీ మోటార్లు వాడే పరిస్థితి రైతులకు లేదు. కాంగ్రెస్ పార్టీ రైతులను నమ్మించి గొంతుకోసే ప్రయత్నం చేస్తున్నది. అన్నింటిని గమనిస్తున్న రైతులు బీఆర్‌ఎస్ పక్షానే ఉండి కాంగ్రెస్‌కు ఓటుతోనే సమాధానం చెబుతారు.

– పోలె లింగయ్య, రైతు, గుడిపల్లి



## ఎవుసానికి 3గంటల కరెంటు సరిపోదు

కాంగ్రెస్ నాయకులు చెబుతున్నట్లు వ్యవసాయానికి 3గంటల కరెంట్ సరఫరా సరిపోదు. ఇక్కడ రైతులెవరూ 3హెచ్‌పీ, 5హెచ్‌పీ తప్ప 10హెచ్‌పీ మోటర్లు వాడుతలేరు. 10 హెచ్‌పీ మోటార్లు వాడితే లో ఓల్టేజీ సమస్యలు వస్తయి. రైతులందరూ ఒకేసారి 10 హెచ్‌పీ మోటార్లు వాడితే ఇప్పుడున్న ట్రాన్స్‌ఫార్మర్లు పనిచేయవు. నిత్యం కరెంట్ సమస్యలతో పాటు రైతులకు మోటర్ మరమ్మతు ఖర్చులు భారమవుతయి. ప్రస్తుతం ఇస్తున్నట్లు 24గంటల కరెంట్ ఇస్తేనే సరిపోతుంది. 10హెచ్‌పీ మోటర్లు పెట్టి 3గంటల కరెంట్‌తో వ్యవసాయం చాలా కష్టం. 3గంటల కరెంట్ సరిపోతుందని చెబుతున్న రేవంత్‌రెడ్డికి వ్యవసాయం గురించి తెలియనట్లుంది. వ్యసాయం గురించి తెలవనోళ్లు గిట్లనే అడ్డం దొడ్డం మాట్లాడుతారు. రైతులందరూ 24గంటల కరెంట్ ఇస్తున్న సీఎం కేసీఆర్ సార్ మద్దతిస్తాం.

– కటికం శ్రీనివాస్‌రెడ్డి, జువ్విగూడెం(గ్రా), నార్కట్‌పల్లి



# ధరణి పోతే అరిగోసే..

## ధరణి స్థానంలో భూమాత పోర్టల్ అంటున్న కాంగ్రెస్

**పాత రెవెన్యూ వ్యవస్థనే తీసుకొస్తామనడంతో రైతుల్లో గుబులు**

**మళ్లీ వీఆర్‌ఓ నుంచి తాసీల్దార్ వరకు పైరవీలు..**

నల్లగొండ, నవంబర్ 24 : గతంలో భూమి అమ్మాలన్నా.. కొనాలన్నా.. అధికారుల చుట్టూ ప్రదక్షిణలు, నెలల తరబడి ఎదురుచూపులు తప్పేవి కావు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ధరణి పోర్టల్ తెచ్చాక సమూల మార్పులు వచ్చాయి. 10నిమిషాల్లో భూ క్రయ విక్రయాలు, మ్యుటేషన్ తాసీల్దార్ పరిధిలోనే పూర్తవుతున్నాయి. ప్రస్తుతం కాంగ్రెస్ నాయకులు తాము అధికారంలోకొస్తే ధరణి తీసేసి భూమాత తెచ్చి పాత రెవెన్యూ వ్యవస్థను కొనసాగిస్తామనడంపై రైతులు ఆందోళన చెందుతున్నారు. ధరణి తీసేస్తే మళ్లీ వీఆర్‌ఓ నుంచి తాసీల్దార్ వరకు చేతులు తడపడం.. ఆఫీసుల చుట్టూ తిరగడం తప్పదా అని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రద్దయిన పహానీ వ్యవస్థ భూ మాత పోర్టల్‌తో మళ్లీ మనుగడలోకి వస్తే పాస్ పుస్తకాల్లో పట్టాదారు స్థానంలో ఒకరు, కబ్జాదారు స్థానంలో మరొకరు ఉంటారు. ఇందులోని 32 కాలమ్స్‌లో ఏంఏం రాస్తారో.. రాస్తే మళ్లీ పోలీస్‌స్టేషన్లు, కోర్టుల చుట్టూ తిరగాల్సిందేనా అని రైతులు జంకుతున్నారు. మ్యానువల్ పహానీ అమల్లో ఉన్నప్పుడు పైరవీకారులు, లంచగొండిదారులదే రాజ్యమైంది. నాటి సాఫ్ట్‌వేర్‌పై సైతం పలు అనుమానాలు ఉన్నాయి.ప్రస్తుతం ధరణి పోర్టల్ పుణ్యమా అని భూముల గొడవలు పోయి ప్రశాంతంగా ఉంటున్న రైతులు మళ్లీ పాత పద్ధతే తెస్తామంటున్న కాంగ్రెస్ నాయకుల మాటలతో ఆందోళన చెందుతున్నారు. ధరణి తెచ్చి సమస్యలు పరిష్కరించిన బీఆర్‌ఎస్ పార్టీకే తమ మద్దతు ఇచ్చి పోర్టల్‌ను కాపాడుకుంటామని రైతులు పేర్కొంటున్నారు.



## కాంగ్రెస్ పాలనలో మధ్యవర్తులదే రాజ్యం

సీఎం కేసీఆర్ ధరణి పోర్టల్ తెచ్చాక రైతుల కష్టాలు పూర్తిగా పోయాయి. కాంగ్రెస్ పాలనలో రైతులు భూమి రిజిస్ట్రేషన్‌కు రిజిస్ట్రేషన్ ఖర్చులే గాక మధ్యవర్తులకు లంచాలు ఇచ్చి చేయించుకునేది. సీఎం కేసీఆర్ ముందు చూపుతో ధరణి తేవడంతో ఖర్చులు తగ్గి రైతుల కష్టాలు తీరాయి. ధరణి పోర్టల్ వచ్చాక పైసా లంచం లేకుండా భూముల రిజిస్ట్రేషన్లు పూర్తవుతున్నాయి. మీసేవా కేంద్రంలో ధరణి పోర్టల్‌లో భూమికి ఉన్న విలువ ప్రకారం ఆన్‌లైన్‌లో పైసలు కట్టి మిగతా వారెవరికీ పైసలు ఇవ్వాల్సిన అవసరం లేకుండానే రిజిస్ట్రేషన్లు పూర్తవుతున్నాయి. భూముల వివరాలు ఆన్‌లైన్‌లో ఉండడంతో రైతులకు ఇబ్బంది లేకుండా రిజిస్ట్రేషన్లు సులువుగా అవుతున్నాయి. రైతుల మేలు కోరిన సీఎం కేసీఆర్ ధరణి వ్యవస్థను తెచ్చి రైతులందరికి ఇబ్బంది లేకుండా చేశారు. మా కష్టాలు తీర్చిన సీఎం కేసీఆర్‌ను కాదని ఇంకొకరికి అధికారం కట్టబెట్టే ప్రసక్తే లేదు.

– పురుషోత్తంరెడ్డి, వేములపల్లి

## దోపిడీ చేసేందుకే భూమాత అంటున్నరు

కాంగ్రెసోళ్లు ధరణి రద్దు చేసి రైతుల జీవితాలతో చెలగాటమాడాలని చూస్తుండ్రు. మళ్లీ దళారీ వ్యవస్థ తెచ్చి మమ్మల్ని దోపిడీ చేయాలని చూస్తున్నరు. సీఎం కేసీఆర్ సార్ ధరణి పోర్టల్ తెచ్చాన కాడి నుంచి ఎవరి భూమి వారి పేరున పదిలంగా ఉంది. భూ తగాదాలు తగ్గాయి. రిజిస్ట్రేషన్లకు రోజుల తరబడి అధికారుల చుట్టూ తిరిగే రోజులు పోయాయి. రిజిస్ట్రేషన్, మ్యుటేషన్, నాలా పర్మిషన్‌లైనా ఒక్కరోజులో వెంటనే జరుగుతున్నాయి. దానికి సంబంధించిన సమాచారం మన ఫోన్ నంబర్‌కు ఎప్పటికప్పుడు సమాచారం వస్తుంది. ఎలాంటి పైరవీలకు తావు లేకుండా భూ యజమానికి తెలవకుండా మరొకరి పేరు మీదకి మారే అవకాశమే లేదు. రైతు సంతోషంగా ఉండటం కాంగ్రెస్ వారికి ఇష్టం లేనట్లుంది. వారికి అధికారం మీద తప్ప రైతులపై గానీ వ్యవసాయంపై గానీ అవగాహన లేదు. రైతులకేం కావాలో అన్నీ సమకూరుస్తున్న సీఎం కేసీఆర్ సార్‌కే మేము అండగా ఉంటాం.

– ధీరావత్ హతీరాం, నేన్యాతండా(గ్రా), మిర్యాలగూడ టౌన్



## భూమి విలువ తెలిసినోడు కౌలుదారు చట్టాల గురించి మాట్లాడడు

భూమి విలువ తెలిసినోడు కౌలుదారు చట్టం తెస్తానని మాట్లాడడు. 50ఏండ్లుగా వ్యవసాయం చేస్తున్నా. కాంగ్రెస్ పాలనలో పట్వారీలు పైసలు తీసుకుని భూమి ఒకరి పేరు నుంచి మరొకరి పేరు మీదకు మార్చేటోళు. ఎవరి దగ్గరైనా భూమి కొంటే పట్వారీల చుట్టూ, రిజిస్ట్రేషన్ కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వచ్చేది. పట్వారీ చెప్పిన దళారి దగ్గరకి పోతే ఆయన డబ్బులు తీసుకుని ఆయన చెప్పిన టైంకు భూమి పట్టా చేయించేటోళ్లు. భూమి రేట్లో సగం దళారులకే పోయేది. కడుపున పుట్టిన పిల్లలకు పట్టా చేయాలన్నా పైసల మీద పైసలు తీసుకునేటోళ్లు. ఇయ్యాల ఆ పరిస్థితి లేదు. మండలంలోనే రిజిస్ట్రేషన్ అవుతుంది. తాసీల్దార్ అన్ని విషయాలు చెప్పి పట్టా చేసి పంపుతుండ్రు. అర్ధ గంటలోనే మ్యుటేషన్లు, అమిట్‌మెంట్లు అన్ని అయిపోతుండే. కొడుకులకు, కోడండ్లకు, కూతుళ్లకు పట్టా చేయాలంటే తక్కువ పైసల్ అయితున్నయ్. కౌలుదారు చట్టం తెస్తే వాడి భూమి నాదేనని కేసులు పెడ్తే పెద్ద మనుషులు, పోలీస్ స్టేషన్లు, కోర్టుల చుట్టూ తిరగాలే. మేము వేలు పెట్టి సంతకం పెడితే మా భూమి మాకు కనపడే ధరణినే మాకు కావాలి.



– ఇంజం రామిరెడ్డి, బెజ్జికల్(గ్రా), త్రిపురారం(మం)


## ధరణి పోతే దళారులదే రాజ్యం



గతంలో ధరణి లేనప్పుడు భూ రికార్డులన్నీ అస్తవ్యస్తంగా మారి దళారులదే హవా నడిచేది. రికార్డుల్లో భూములు తారుమారు చేసేవారు. దీంతో రైతుల మధ్య భూతగాదాలు పెట్టి దోచుకునేవారు. ప్రస్తుతం బీఆర్‌ఎస్ ప్రభుత్వం ధరణి పోర్టల్ తేగా రైతులు ఎంతో ఆనందంగా ఉన్నారు. సెంటు భూమి తేడా లేకుండా ఎవరు మార్చకుండా ధరణిలో భద్రంగా భూములు ఉన్నాయి, కాంగ్రెస్ నాయకులు మేము అధికారంలోకొస్తే భూమాత పోర్టల్ తెచ్చి పాత పద్ధతిన రికార్డులు యథావిధిగా ఉంచుతామంటున్నారు. మళ్లీ రైతులకు గొడవలు పెట్టినట్లు అవుతుంది. ప్రస్తుతం ఎంతో మంచిగా ఉన్న ధరణిని కొనసాగించేందుకు బీఆర్‌ఎస్‌కే అండగా ఉంటాం.

– గుర్రం శ్రీనివాస్‌రెడ్డి, తిప్పలమ్మగూడం(గ్రా), తిప్పర్తి

## కాంగ్రెసోళ్లను బొంద పెడితే సరిపోద్ది



ధరణి పోర్టల్‌ను బంగాళఖాతంలో పడేస్తామని పదే పదే చెప్తున్న కాంగ్రెసోళ్లను మొదలు ఈ ఎన్నికలో బొందపెడితే సరిపోద్ది. మాకు 32ఎకరాలు సాగు భూమి ఉంది. 22ఎకరలు కౌలుకు ఇస్తా. మిగిలినది నేనే సాగు చేస్తా. పాత పద్ధతిలో 36 కాలమ్‌లు తీసుకొచ్చి, కౌలు రైతులకు అగ్రిమెంట్ ఇస్తే , మరి రైతు బంధు ఎట్లా వస్తయ్.. ఎవరికిస్తరు. ఇలా స్పష్టత లేకుండా రైతులను ఇబ్బంది చేసే పనికి పూనుకుంటున్న కాంగ్రెస్‌ను తరిమికొడుతాం. కాంగ్రెసోళ్ల పాలనలో వీఆర్‌ఓ వ్యవస్థ ఉన్నప్పుడు ప్రతి పనికి పైసలిస్తేనే పనులు అయ్యేవి. మా భూమికి భద్రత లేకుండే. ధరణి పోర్టల్ వచ్చాక రిజిస్ట్రేషన్, మ్యుటేషన్ ప్రక్రియ అత్యంత సులభంగా, పారదర్శకంగా మారింది. రిజిస్ట్రేషన్, మ్యుటేషన్ ప్రక్రియ అంతా తాసీల్దార్ కార్యాలయంలో జరుగుతుంటే రైతుగా ఏ ఇబ్బందులు లేకుండా ప్రశాంతంగా ఉంటున్నాం. ధరణితో ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఉన్న సమయంలో దానికి తీసేస్తామని చెబుతున్న కాంగ్రెస్‌కు బరాబర్ ఓటేయం.

–యాట్రమాద రాంరెడ్డి, పెద్దసూరారం(గ్రా), నల్లగొండ రూరల్